‘అభయ’తో మహిళలకు భద్రత

- ఏలూరులో అభయ రక్షకదళం
- విద్యార్థినులు, మహిళల భద్రతకు ప్రత్యేక బృందాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల రక్షణకు ఏలూరు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గతంలో దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్ల తరహాలోనే నేడు అభయ యాప్‌ను రూపొందించి, పక్కాగా అమలు చేస్తోంది. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చొరవ, ప్రత్యేక శ్రద్ధతో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నారు. ఇటీవల కాలంలో మహిళలు, విద్యార్థినులు, చిన్నారులపై అఘాయిత్యాలు, ఆకతాయిల వేధింపులు పెరిగిపోతోన్న తరుణంలో ఏలూరు నగరంలో ‘అభయ’ అండగా నిలుస్తోంది. మహిళలు, విద్యార్థినులకు ఆపద వస్తే అభయ యాప్ లేదా డయల్ 112కు ఫోన్ చేస్తే 10 నిమిషాల్లోనే బాధితులకు రక్షణగా నిలిచేలా చర్యలు చేపట్టారు. ఏలూరు నగరంలో ఐదు అభయ టీమ్స్‌ను ఎస్పీ కేపీ శివకిషోర్ ఏర్పాటు చేశారు. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, రూరల్, మహిళా స్టేషన్‌తోపాటు అదనపు టీమ్‌లు పనిచేస్తున్నాయి. వీరంతా అభయ స్కూటీ వాహనాలపై నగరంలో తిరుగుతూ ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేసేందుకు, మహిళల్లో ధైర్యాన్ని నింపేందుకు అవగాహన కల్పిస్తున్నారు.


ఏలూరులో కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అభయ పోలీస్

ఆత్మస్థైర్యాన్ని నింపుతూ..

డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ, టూటౌన్ మహిళా ఎస్సై నాగకళ్యాణి, ఒక్కో స్టేషన్ నుంచి మహిళా పోలీస్, గ్రామాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శితోపాటు పోలీస్ కానిస్టేబుల్స్ అభయ టీమ్‌లో ఉన్నారు. వీరంతా నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, పాఠశాలలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలకు రక్షణగా నిలుస్తున్నారు. విద్యార్థినులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు



మహిళలపై నేరాలకు పాల్పడితే సహించబోం. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ నేతృత్వంలో అభయ రక్షక దళం మహిళలకు, చిన్నారులకు, విద్యార్థినులకు అండగా ఉండేలా చర్యలు చేపట్టాం. ఏలూరు నగరంలో 5 అభయ రక్షక బృందాలు వాహనాలపై తిరుగుతూ విద్యార్థినులకు తోడుగా ఉంటున్నాయి. ఆకతాయిలు ఎవరైనా వేధింపులకు గురిచేస్తే ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు కఠినంగా ఉంటాయి.

– డి.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడుదాం

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ డి.శివకుమార్ అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవన్‌లో శనివారం నిర్వహించారు. తొలుత విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్ఆర్ పేట, మున్సిపల్ పార్కు నుంచి స్ఫూర్తి భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐవైఎఫ్ పతాకాన్ని ఏలూరు జిల్లా మాజీ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. మహాసభలో శివారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. నూతన విద్యా విధానం పేరుతో రాష్ట్రంలో, దేశంలో 25 లక్షల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు మూత వేయడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి


మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

వచ్చిన తర్వాత పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్న తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నేటికీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయి కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వమే నేరుగా బాధ్యత తీసుకొని అన్ని సౌకర్యాలూ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శివకుమార్, యర్రా మధు, నాని, అశోక్ కుమార్, లోకేశ్వరి, లావణ్య, రాజ్యలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’ అమలుకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వాలు డైవర్ట్ పాలిటిక్స్ ఆపి ప్రజలకు సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాపోరు యాత్ర ఏలూరు 2 టౌన్ ప్రాంతంలో శనివారం నిర్వహించారు. తంగెళ్లమూడి తాపీ మేస్త్రి కాలనీ, కుమ్మరి రేవు, లంకపేట, రాజీ నగర్, ఇజ్రాయిల్ పేట, ముస్లిం బజార్, కంద్రిక గూడెం, చోడిదిబ్బ ప్రాంతాల్లో కిషోర్ మాట్లాడారు. ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి ఊరూరా బెల్ట్ షాపులు పెట్టిందని విమర్శించారు. నిత్యావసర ధరలను అరికట్టడంలో విఫలమైందన్నారు. ఏలూరు నగరంలో శివారు ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కుక్కలు, దోమలు, పందులు బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ , వర్షాకాలంలో డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆర్ఓ సిస్టం ద్వారా రూ.2కే 20 లీటర్ల మినరల్ వాటర్ ప్రతి ఇంటికీ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.జగన్నాథరావు, ఎం అరుణ కుమారి, ఎ.శ్యామలారాణి, జి.శారద, ఎం ఎస్సాక్, జె.గోపి, ఎస్ సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ, చల్లా పైడయ్య, పి.సత్తిరాజు, కె.ప్రభు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న కిషోర్

సమరశీల పోరాటాలతోనే నూతన ప్రజాస్వామ్యం

ఏలూరు (టూటౌన్): సమరశీల పోరాటాల ద్వారానే నూతన ప్రజాస్వామ్యం సాధ్యమని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావు (యూవీ) అన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డేమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో శనివారం సభ నిర్వహించారు. సభలో యూవీ మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో మృతి చెందిన వారికి జోహార్లర్పించారు. వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కె.నాని, క్రాంతి, ప్రముఖ న్యాయవాది కేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.


అమరవీరులకు జోహార్లర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఆయుర్వేద వైద్యం శ్రేష్ఠం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్యం ఎంతో శ్రేష్టమైందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్ అన్నారు. శనివారం స్థానిక వన్‌టౌన్లోని గీతా భవన్‌లో లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 102 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద వైద్యానికి పురాణ కాలం నుంచి గుర్తింపు ఉందని నగేష్ అన్నారు. మన పరిసర ప్రాంతాల్లో వనమూలికలు, ఆకులు, దినుసుల ద్వారా ఔషధాలు తయారు చేసి ఇవ్వడం , రసాయన పదార్థాల కల్తీ లేకపోవడం, ఆయుర్వేద మందుల వినియోగం ఉపయుక్తంగా, స్వల్పకాలంలో వ్యాధి నివారణకు ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో నంగులూరి లక్ష్మీ నరసింహారావు, చెన్నా వెంకట్రామయ్య, పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్ పాల్గొన్నారు.


పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఆయుర్వేద వైద్యుడు నగేష్

రూ.6.44 కోట్ల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): ఈ నెల 8వ తేదీ వరకు రూ.6.44 కోట్లు విలువైన 2793.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 333 మంది రైతుల నుంచి 39 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి, రైస్ మిల్లుకు తరలించినట్టు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. భీమడోలు మండలంలో ఆన్‌లైన్ ద్వారా నేటి వరకు రూ.76 లక్షల విలువైన 330.440 మెట్రిక్ టన్నుల ధాన్యం 37 మంది రైతుల నుంచి 9 రైతు సేవా కేంద్రాల ద్వారా కొన్నట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలులో సందేహాలుంటే జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812 230448, 77020 03584, టోల్ ఫ్రీ నెంబర్ 18004256453) ఏర్పాటు చేశామని తెలిపారు.

గ్రామీణ తపాలా జీవిత బీమా ఒక వరం

ఏలూరు (టూటౌన్): గ్రామీణ తపాలా జీవిత బీమా వినియోగదారులకు ఒక వరమని ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ శ్రీకర్ బాబు అన్నారు. స్థానిక సత్రంపాడులోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శనివారం ఆయన తన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్, ట్యాక్స్ మినహాయింపు ఉన్న తపాలా జీవిత బీమా ప్రీమియం చిన్న మొత్తాల పొదుపులో వినియోగదారుల పాలిటి కల్పతరువుగా అభివర్ణించారు. రానున్న రోజుల్లో గ్రామీణ తపాల జీవిత బీమా ప్రీమియం విరివిగా సేకరించి, ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ సంస్థ నుంచి బీమాను కల్పించాలని కోరారు. సమావేశంలో స్థానిక హెడ్ పోస్ట్ మాస్టర్ లోకల్ పోస్ట్ మాస్టర్లు మరియు గ్రామీణ డాక్ సేవకులకు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సిబ్బంది, పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు

కొబ్బరి ధర డీలా.. రైతులు విలవిల

పెదవేగి : కల్పవృక్షం కంట తడి పెట్టిస్తోంది. కనీస పెట్టుబడులు సైతం రాక ఈ పంట సాగు చేస్తున్న రైతులంతా దిగులు చెందుతున్నారు. డెల్టా ప్రాంతంలో వరి పంట తరువాత అంత ప్రాధాన్యత సంతరించుకున్న కొబ్బరి సాగు కొన్నేళ్లుగా సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కొన్ని నెలలుగా కొబ్బరి ధర హెచ్చుతగ్గుల మధ్య నడుస్తోంది. దీంతో ఈ పంట సాగుపై రైతుల్లో అనాసక్తి వ్యక్తమవుతోంది. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి మండలంలో 10,570 వేల ఎకరాల్లో, దెందులూరులో 1,428, పెదపాడులో 275, ఏలూరు రూరల్ మండలంలో 213 ఎకరాల్లో కొబ్బరిని రైతులు సాగుచేస్తున్నారు. కాలువ గట్లపై, ఖాళీ స్థలాల్లో, ఇళ్ల ముందు ఉన్న కొబ్బరి చెట్లు ఎక్కువ మందికి ఆదాయ మార్గంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కొబ్బరి ధరపై అంతా ఆశలు పెంచుకున్నారు.

ధర పతనం

ఒకానొక దశలో రైతుకు చెట్టు వద్దే కొబ్బరి కాయకు దాదాపు రూ.13 నుంచి రూ.15 వరకు లభించింది. నేడు కొబ్బరి కాయ ధర కేవలం రూ.6 నుంచి రూ.8 పలుకుతోంది. రైతులకు ఖర్చులు పోను రూ.2 మాత్రమే మిగులుతోందని రైతులు వాపోతున్నారు. ధర భారీగా పతనమవడంతో రైతులు డీలా పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో మన కొబ్బరి కాయలకు అంతగా మార్కెట్ లేదని సాకు చూపుతూ ఇక్కడి వ్యాపారులు స్థానిక రైతులను మభ్యపెడుతున్నారు.

దింపు కార్మికుల కొరత

కొబ్బరి కాయ దిగుబడి ఆశాజనకంగా ఉన్నా మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాయకు రూ.1.30 పైసలు చొప్పున దింపు కూలి చెల్లించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల చెట్టుకు నాలుగు కాయలున్నా, నలభై కాయలున్నా రూ.100 చొప్పున దింపుడు కూలి చెల్లించాల్సి వస్తోంది. దింపు కార్మికుల కొరతతో గిరాకీ ఏర్పడింది. దింపుడు రేటు భరించలేక కొందరు చెట్లపైనే కాయలు ఉంచేస్తున్నారు. కొందరు రెండు మూడు నెలలకోసారి దింపు తీయిస్తున్నారు. మరికొందరు మార్కెట్‌లో ఎప్పుడు రేటు పెరుగుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

దళారుల దోపిడీ

సగటు రైతును కొబ్బరి మార్కెట్ నిలువెల్లా మోసం చేస్తోంది. అంకెల మాటల గారడీలో వారిని దళారీలు మాయ చేస్తున్నారు. ముఖ్యంగా టోకు వర్తకులు సన్నకారు రైతులను అందినకాడికి దోచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పలువురు టోకు వర్తకులు ఇటీవల సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారు. పైగా వారిలో కొందరు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే పెద్దఎత్తున కొబ్బరి కొనుగోలు, అమ్మకాలు చేస్తున్నారు. మరికొందరు వ్యాపారులు చిన్నతరహా పరిశ్రమగా అనుమతి పొంది పన్ను ఎగవేస్తూ లక్షల్లో కొబ్బరి కాయలను నిల్వ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. గోదాముల్లో కొబ్బరి తోటల్లో విచ్చలవిడిగా కాయలను రాశులుగా పోస్తున్నారు. అనధికార వ్యాపారులపై అధికారులు దాడులు చేస్తే తమకు కొంత వరకైనా న్యాయం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. రానున్నవి పండగ రోజుల్లోనైనా కొబ్బరి కాయ రేటు పెరుగుతుందని వారు ఆశిస్తున్నారు.


ధర లేక రాసులుగా పోసిన కొబ్బరికాయలు

ప్రభుత్వమే ఆదుకోవాలి

నిమ్మ, జామకాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. అలాంటిది ఎంతో శ్రమపడి, పెట్టుబడితో పండిస్తున్న కొబ్బరికి మార్కెట్‌లో విలువలేకుండా పోయింది. ఈ పరిణామం కొబ్బరి సాగు ఉనికికే ప్రమాదం. రైతులు అపారంగా నష్టపోతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిలక వెంకటేశ్వరరావు కూచింపూడి రైతు

మార్కెట్‌ను నియంత్రించాలి

కొబ్బరి పంట మానవ జీవితంలో అనేక అవసరాలు తీరుస్తుంది. కాయ సైజు, మచ్చ పేరుతో వ్యాపారుల చేతుల్లో కొబ్బరి రైతులు దశాబ్దాలుగా మోసపోతున్నారు. ప్రభుత్వ నియంత్రణలేక టోకు వర్తకులు అసలైన సాగుదారులను దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రంగంపై ప్రభుత్వ నియంత్రణ అవసరం.

– కొండేటి శ్రీనివాస్ రైతు గోపన్నపాలెం

క్లుప్తంగా

సండే స్కూల్ టీచర్స్ ట్రైనింగ్


శిక్షణలో పాల్గొన్న టీచర్లతో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఆల్ సెయింట్స్ ఐసీఎం కథేడ్రల్‌లో శనివారం సండే స్కూల్ టీచర్స్ ట్రైనింగ్ నిర్వహించారు. కృష్ణ, గోదావరి డయోసిస్‌లోని ఐసీఎం సంఘాల సండే స్కూల్ టీచర్స్ హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్స్ చైల్డ్ ఇవాన్‌జలిజం ఫెలోషిప్‌కు చెందిన రాజేష్, ఎస్తేరు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐసీఎం సంఘాల అగ్ర పీఠాధిపతులు బిషప్ జాన్ ఎస్‌డీ రాజు సండే స్కూల్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్‌వైపీ ప్రసాద్, ఏలూరు రూరల్ డీనరీ చైర్మన్ డి.యోబు, సంఘ కాపరులు విక్టర్ పాల్, జాన్ వెస్లీ, భాస్కర్ సింగ్, టీవీఎస్ కుమార్, కార్యాలయ సిబ్బంది షేబా డేవిడ్, ఎస్తెరు రాణి, నాని పాల్గొన్నారు.

125 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్ఆర్‌పేటలోని శ్రీ కృష్ణ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 125 మందిని పరీక్షించి, వారికి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.కృష్ణ మాట్లాడుతూ తాను వైద్య వృత్తిలోకొచ్చి 16 సంవత్సరాలయిన సందర్భంగా ప్రతి నెలా రెండో శనివారం తన ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గత 26 నెలల నుంచి ప్రతి నెలా రెండో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నామని వివరించారు. శిబిరంలో రక్త పరీక్షలు, బీఎండీ (ఎముకల సాంద్రత), స్కానింగ్, ఎక్స్‌రే ఉచితంగా చేసి రోగులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఆస్పత్రి టెక్నికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్‌కు వైద్యానికి వచ్చిన ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు నగరంలోని ఆదివారపుపేటకు చెందిన పటాన్ షాకీర్ (32) అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొంది బయటకు వస్తూ ఆసుపత్రి ఆవరణలోనే షాకీర్ పడిపోయి మృతి చెందాడు. వైద్యులు అతని మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ హాస్పటల్ ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	48-68	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44-56	ములక్కాడలు	07, 10
బెండకాయలు	34	కంద	64
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	64
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	00	అల్లం	80
క్యాబేజీ	36-40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	15
దొండకాయలు	28	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	45-55	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	40	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

కొత్తపేటలో పోటెత్తిన భక్తులు


కార్తీక దీపారాధన చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో శ్రావణ నక్షత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ నక్షత్రం ఏరోజు వచ్చినా ఆ రోజు చేసే పూజల కారణంగా కోటి కార్తీక సోమవారాలు చేసిన పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకమని ఆలయ అర్చకుడు చక్రవర్తుల ప్రకాష్ ఆచార్యులు తెలిపారు. శ్రవణ నక్షత్రం వెంకటేశ్వర స్వామి జన్మనక్షత్రం, ఇలాంటి రోజు చాలా అరుదుగా వస్తుందని వెన్నెల కోట లత శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉదయం పలువురు మహిళా భక్తులు ఆలయానికి విచ్చేసి ధ్వజ స్థంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామ స్మరణలతో మార్మోగింది.

యూబీఐని సందర్శించనున్న మంజు గుప్తా

ఏలూరు(మెట్రో): పెన్షన్ – పెన్షనర్ల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజు గుప్తా ఈ నెల 13వ తేదీన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఆర్‌పేట బ్రాంచిని సందర్శిస్తారని లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్‌ను ఉపయోగించి ఫేస్ అథెంటికేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించే ప్రక్రియలో, ఆధార్ నంబర్, ఓటీపీ కోసం మొబైల్ నంబర్, పీపీవో నంబర్, బ్యాంక్ / పోస్టాఫీసులో ఖాతా నంబర్‌కు సంబంధించిన వివరాలు మొదటిసారిగా అవసరమని తెలిపారు. పింఛనుదారులందరూ తమ జీవిత ధ్రువీకరణ పత్రాలను డిజిటల్ మాధ్యమం ద్వారా సమర్పించేందుకు ఈ కేంద్రాన్ని సందర్శించాలని పెన్షన్ శాఖ కోరినట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఏలూరు (టూటౌన్): ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా రెండో సార్వత్రిక ఎన్నికలు ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్టు సంఘం జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా విభిన్న బహుజన వర్గాల్లోని ప్రముఖులు హాజరై నాలుగు విభిన్న అంశాలపై మాట్లాడతారని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులుగా విశ్రాంత తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావు, బహుజన నాయకులు గుడే రాంబాబు, పాలపర్తి బాలాజీ, నెరుసు నాగమణి యాదవ్, పాము రవీంద్రనాథ్ వ్యవహరిస్తారని వెంకటేశ్వర్లు వివరించారు.

మెరుగైన సేవలు అందించాలి

ఏలూరు టౌన్: రోగులకు మెరుగైన సేవలందించాలని ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన శనివారం ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఎముకలు, స్త్రీ ప్రసూతి, అత్యవసర విభాగం, ఓపీ విభాగాలతో పాటు సిటీ స్కాను, ఎంఆర్ఐ, ఎక్స్‌రే తదితర విభాగాలను సందర్శించారు. రోగులకు అందుతోన్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. సిటీ స్కాను, ఎంఆర్ఐ విభాగాల వద్ద రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి సెల్‌ఫోన్‌కు అసభ్యకరమైన మెసెజ్‌లు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తి కేసు నమోదు చేశారు. ఏలూరు ఆదివారపుపేటకు చెందిన యువతిని ఏలూరు చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన పవన్ కళ్యాణ్ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆమె ఫోన్‌కు అసభ్యకర మెసెజ్‌లు పెడుతుండటంతో తల్లి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.